క్లుప్తంగా

ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా ప్రసాద్‌బాబు



కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా ప్రసాద్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు డీఆర్ నాగభూషణం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రామ్మోహన్ అవినీతి ఆరోపణలపై సస్పెండ్ కావడం తెలిసిందే. ఆయన స్థానంలో గుత్తిలో పనిచేస్తున్న ఇతన్ని కళ్యాణదుర్గానికి ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ రామానాయుడు

కూడేరు: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే ప్రమాదానాకి గురై ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తుందని ఏఎస్ఐ రామానాయుడు హెచ్చరించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 6వ ఆంధ్ర బెటాలియన్ సీఏటీసీ–3 శిక్షణతరగతులు ప్రారంభమయ్యాయి. నంద్యాల, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూల్ జిల్లాలకు చెందిన 350 మంది క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. శుక్రవారం క్యాడెట్లకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై ఏఎస్ఐ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా, సుబేదర్ సుఖ్‌దేవ్ సింగ్, ఎన్‌సీసీ అధికారులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ ఈరమ్మ

ఉరవకొండ: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెల రోజులపాటు నిర్వహిస్తున్న ఇంటింటికీ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ ఈరమ్మ సూచించారు. శుక్రవారం పట్టణంలో ప్రారంభమైన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. పట్టణంలోని 10వ వార్డు, ఇంద్రానగర్ తదితర ప్రాంతాల్లో బీఎల్ఓలు చేపడుతున్న కార్యక్రమాన్ని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర, ఎన్నికల సీనియర్ సహాయకులు వంశీకృష్ణతో కలిసి తహసీల్దార్ పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆగస్టు 21 వరకూ జరిగే కార్యక్రమంలో ఇంటింటికి వచ్చే బీఎల్ఓలకు ప్రజలకు సహకరించాలన్నారు. ముఖ్యంగా డోర్‌నెం పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గం ఏర్పాటు




అధ్యక్షుడు వేలూరు మరియప్ప

కణేకల్లు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. స్థానిక చిక్కణ్ణేశ్వర స్వామి కల్యాణ మంటపంలో శుక్రవారం అనంతపురం జిల్లా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు విరుపాక్షిరెడ్డి సమక్షంలో పట్టణ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా వేలూరు మరియప్ప, ఉపాధ్యక్షులుగా గంగలాపురం ముత్తు, యు.ఆనంద్ రాజ్, కార్యదర్శిగా చాంద్‌బాషా, కోశాధికారిగా ఎ.మాబుసాబ్, కార్యవర్గసభ్యులుగా టి.కేశవరెడ్డి, బజాజ్ తిప్పేస్వామి, షేక్ ఉసేన్, కొలిమి సర్మస్, జిన్నా బాబు, శరబన్నగౌడ్ ఎన్నికయ్యారు.

నేలకొరిగిన అరటి

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంట గ్రామ సమీపంలో రైతు సురేష్ సాగు చేసిన అరటి పంట శుక్రవారం ఈదురుగాలులకు నేలకొరిగింది. ఆయన నాలుగు ఎకరాల్లో యాలక్కి రకం అరటి పంటను సాగు చేశాడు. ఈదురుగాలులకు మూడు ఎకరాల్లో అరటి పంట నేలవాలి నష్టం వాటిల్లింది. మరో నెలరోజుల్లో కోతలకు సిద్ధంగా వున్న పంట నేలవాలడంతో సుమారు రూ.6.5 లక్షల వరకు పంట నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరాడు.

పరిశుద్ధాత్మతో ఉజ్జీవించాలి



ప్రసంగిస్తున్న అంతర్జాతీయ ప్రసంగీకులు

కళ్యాణదుర్గం: సంఘ కాపరులు పరిశుద్ధాత్మతో ఉజ్జీవింపబడాలని నేషనల్ ప్రేయర్ మూవ్‌మెంట్ అంతర్జాతీయ ప్రసంగీకులు డాక్టర్ కేవీ పాల్, డాక్టర్ తెరాస్సా పాల్ సూచించారు. స్థానిక సీఅండ్ఐజీఎం చర్చిలో శుక్రవారం పాస్టర్ల సెమినార్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ దైవజనులు పరిశుద్ధాత్మతో ఉజ్జీవింపబడాలన్నారు. అనంతరం పలు బైబిల్ సందేశాలను తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకుడు చల్లా కిశోర్ చౌదరి, పాస్టర్లు దేవరాజ్, జాన్‌పాల్, జేమ్స్‌నాయక్, జాన్‌పాల్, సంతోష్, నారాయణ పాల్, ఐజయ్య, చర్చి కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్‌చౌదరి పాల్గొన్నారు.

సేవే వలంటీర్ల పరమావధి



కూడేరు: ఆస్పత్రిలో చిన్న రామన్నకు నగదు అందజేస్తున్న వలంటీర్ లావణ్య(ఫైల్)

కూడేరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, పథకాలు పారదర్శకంగా అర్హులందరికీ వర్తింపజేసేందుకు ప్రతి 50 ఇళ్లకూ ఒక వలంటీర్‌ను నియమించారు. వలంటీర్లు వారికి అప్పగించిన ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలియజేస్తూ, సమస్యలు తెలుసుకుంటూ, ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అలాగే కరోనా సమయంలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కూడేరు మండలంలోని వలంటీర్ లావణ్య తన పరిధిలోని ఇళ్లకు వెళ్లి పలు సేవలందిస్తోంది. తెల్లవారకమునుపే పింఛన్ అందజేస్తూ శభాష్ అనిపించుకుంటోంది. ఈ క్రమంలో 2021లో మరుట్లకు చెందిన చిన్న రామన్న అనే పింఛన్ లబ్ధిదారుడు అనారోగ్యంతో అనంతపురంలోని ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ లావణ్య 40 కిలోమీటర్ల దూరం వెళ్లి చిన్న రామన్నకు పింఛన్ నగదును అందజేసింది. రామన్న కుటుంబ సభ్యులు వలంటీర్ లావణ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

వలంటీర్లకు వందనం

వలంటీర్ సేవలు అభినందనీయం



అనంతపురం ఆస్పత్రిలో ఉన్నపుడు వైద్యం ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడ్డాం. అలాంటి సమయంలో వలంటీర్ లావణ్య సొంత ఖర్చులతో అనంతపురం ఆస్పత్రికి వచ్చి పింఛన్ నగదు అందజేసింది. ఆ నగదు వైద్య ఖర్చులకు ఉపయోగపడింది. వలంటీర్ సేవలు అభినందనీయం.

చిన్న రామన్న, మరుట్ల

సంక్షేమ పథకాల ప్రదాత సీఎం జగన్



యర్రగుంటలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: ప్రజల వద్దకే ప్రభుత్వ పరిపాలన తెచ్చి ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత జగనన్నకే సాధ్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో సర్పంచు వన్నూరమ్మ అధ్యక్షతన 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విప్ కాపు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. టీడీపీ హయాంలో పింఛన్, ఇళ్ల, రైస్‌కార్డులు టీడీపీ కార్యకర్తలు, వారి సానుభూతిపరులకు మాత్రమే అందేవని గుర్తు చేశారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నారన్నారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవలు చేస్తున్న వలంటీర్ల పట్ల చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కామెంట్స్ చేయడంపై విప్ కాపు మండిపడ్డారు. అనంతరం 316 మందికి కాపు వివిధ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలీ, ఎంపీడీఓ శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వండ్రప్ప, వైస్ సర్పంచు కెనిగుంట రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మాబుపీరా, నాయకులు వెంకటరెడ్డి, అశోక్, శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ ఈరన్న, సర్పంచులు ఫణీంద్రగౌడ్, ప్రకాష్‌చౌదరి, భాస్కర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, గంగలాపురం ముత్తు, రఘు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం గ్రామంలో సర్పంచ్ అనిల్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ బ్రహ్మయ్య, గంధవీడి తిప్పేస్వామి, శ్రీపతి, మాజీ డీలర్ గోవిందప్ప, హంపన్న, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ బీమా' పేదల పాలిట వరం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ బీమా పథకం పేదలు, అసంఘటిత కార్మికులకు ఓ వరం లాంటిందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పేదలకు అన్ని రకాలుగా మంచి జరగాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాయదుర్గం పట్టణంలో రెండునెలల క్రితం పిడుగుపాటుకు గురై బి.నారాయణరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. కేవలం నెలన్నర రోజుల వ్యవధిలోనే వైఎస్సార్ బీమా పథకం కింద బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం మంజూరు చేసింది. ఈ సొమ్మును శుక్రవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పట్టణంలోని 4వ వార్డు కొలిమివీధిలో నివాసం ఉంటున్న మృతుడు నారాయణరెడ్డి భార్య కృష్ణవేణి ఇంటికి వెళ్లి అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని, పిల్లలను బాగా చదివించాలని అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపుభారతి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు గోవిందరాజులు, పెద్ద వన్నూరుస్వామి, డిష్ గోవిందు, పైతోట సంజీవప్ప, ఫకృద్దీన్, షబ్బీర్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, మాజీ కౌన్సిలర్ వసంతరాజులు, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, బషీర్ అహ్మద్, శ్రీరామిరెడ్డి, నిజాముద్దీన్, రామాంజనేయులు, కొలిమి ఆనంద్, సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి దాదాపీర్, వీఆర్వో ఉమేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

చేనేతకు జీవం పోసిన ఘనత జగన్‌దే

- నేతన్న నేస్తం అమలు చేసినందుకు కృతజ్ఞతగా సంబరాలు
- ఉరవకొండలో నేతన్నల భారీ ర్యాలీ, సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

ఉరవకొండ: జవసత్వాలు కోల్పోతున్న చేనేత పరిశ్రమకు జీవం పోసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత రూ.24 వేలు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా చేనేత పరిశ్రమకు ప్రసిద్ధిగాంచిన ఉరవకొండలో కార్మికులు 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి కార్మికులు నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి కార్మికులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం చేనేత నాయకురాలు, ఎంపీపీ చంద్రమ్మ, పార్టీ చేనేత విభాగం నేతలు ఎంసీ నాగభూషణం, నిమ్మల వెంకటరమణ, కాసుల ఆంజి, బీరేశివ, కరూర్ వెంకటేష్ మాట్లాడుతూ చేనేత కార్మికుల కళ్లలో ఆనందం చూడాలన్న ధ్యేయంతో సీఎం చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. చేనేత కార్మికులు అంతా సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులకు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో చేనేత నాయకులు లక్కాఎర్రిస్వామి, కణేకల్లు రఫీ, ఆర్‌సీ ప్రసాద్, కుర్ని ఎర్రిస్వామి, రాము, అంజి, శంకరసుదర్శన్, వెంకటేష్, చంద్ర, గోపాల్, శ్రీధర్, కొత్త వెంకటేష్, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాల్లో 'వైఎస్సార్ నేతన్న నేస్తం'తో వెలుగులు

రాయదుర్గంటౌన్: పేద చేనేత కుటుంబాల్లో 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అన్నారు. నేతన్న నేస్తం కింద అర్హులైన చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాకు ఒక్కొక్కరికి రూ.24 వేలు జమ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని 1వ సచివాలయంలో లబ్ధిదారులతో కలసి చైర్‌పర్సన్, కౌన్సిలర్ భీమనపల్లి నాగవేణి, వార్డు ఇన్‌చార్జ్ దివాకర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వీక్షించారు. చైర్‌పర్సన్ శిల్ప మాట్లాడుతూ రాయదుర్గం పురపాలకసంఘంలో 'వైఎస్సార్ నేతన్న నేస్తం' కింద ఐదో విడతలో 343 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరిందన్నారు. గతంలో ప్రభుత్వాల ఆదరణ లేక మూలనపడేసిన మగ్గాలకు జగనన్న చలువతో పునర్జీవం వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



గుమ్మఘట్ట: ఆర్.కొత్తపల్లిలో బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



బెళుగుప్ప: అంకంపల్లిలో బుక్‌లెట్ అందజేస్తున్న విశ్వ, పైలా, హరీష్‌యాదవ్

గుమ్మఘట్ట/బొమ్మనహాళ్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గుమ్మఘట్ట మండలంలోని ఆర్.కొత్తపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు జన్మభూమి కమిటీ సభ్యులు రేట్లు ఫిక్స్ చేసి ప్రజలను జలగల్లా పీల్చిపిప్పి దోచుకున్నారని విమర్శించారు. ప్రస్తుతతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పేదల ఇంటిముంగిటకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను జనం నమ్మేస్థితిలో లేరన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. అనంతరం ఆయన మండలంలోని గొనికుంట గ్రామ సమీపంలో ఉపాధి కూలీలు చేస్తున్న ఫీడర్ చానల్ పనులను ఆకస్మికంగా పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు, టీడీ రఘు, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్‌టీ కాంతారెడ్డి, సర్పంచులు ఉమేష్, రమేష్, రాజేష్, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, బేలోడు రామాంజనేయులు, ఈశ్వర్‌రెడ్డి, చిత్రశేఖరప్ప, హరనాథ్‌రెడ్డి, ఓంకార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- బొమ్మనహాళ్ మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, ఎంపీటీసీ శివశంకరమ్మ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్, పయ్యావుల సత్యన్న, జి.ఎం నాయుడు, రమేష్, యువరాజ్‌స్వామి, సంజప్ప, బుజ్జి, జయరామ్‌రెడ్డి, మాబుసాబ్, వీరన్నగౌడ్, పరమేశ్వర, కోటేశ్వరరెడ్డి, ఫోటో బసవరాజు, నాగరాజు, కృష్ణ, వన్నల్లి రామాంజినేయులు, ఆనంద్‌రెడ్డి, వెంకటేశులు, చిక్కణ్ణ, రామ్‌చరణ్, ఆనంద్, వన్నూరుస్వామి, నబీసాబ్, సర్మస్, దేవన్న, అనంతరాజు, నుంకేష్, దర్గన్న , డాక్టర్ బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల గడపల వద్దకే సంక్షేమ పథకాల ఫలాలు

బెళుగుప్ప: గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల గడపల వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోనే ఆదర్శపాలన కొనసాగిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమే అని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అంకంపల్లిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్ హాజరయ్యారు. సర్పంచ్ రుద్రానంద, ఎంపీటీసీ ప్రభావతి, నాయకులు త్రిలోక్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులతో కలసి సంక్షేమ పథకాల సారధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో వారు పొందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తూ వివరించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకుంటూ త్వరితగతిన పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబుళేసు, ఎంపీడీఓ రామచంద్ర, రాష్ట్ర బీసీ అధ్యయన కమిటీ సభ్యుడు ధనుంజయ యాదవ్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, ఎంపీపీ పెద్దన్న, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్, వైస్ సర్పంచ్ భవాని, మార్కెట్‌యార్డు మాజీ ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు కుళ్లాయస్వామి, హనుమంతురాయుడు, శంకరయ్య, బీమరాజు, పెద్ద కుళ్లాయస్వామి, ఎర్రిస్వామి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇళ్ల వద్దకే వైద్యం

కుందుర్పి: 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంతో గ్రామీణులకు ప్రభుత్వం ఇళ్ల వద్దకే వైద్యం అందిస్తోందని వైద్యాధికారులు అనూషా, పటాన్ చాంద్ బేగం సూచించారు. శుక్రవారం మండలంలోని కెంచంపల్లి, జంబుగుంపల తదితర గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ ,108 సాయంతో వైద్యసేవలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

ఉరవకొండ: ఎంపీడీఓగా వరలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా ఓడీసీ మండలం నుంచి బదిలీ పై ఆమె ఉరవకొండకు వచ్చారు. నూతన ఎంపీడీఓను జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పార్టీ నాయకులు తిరుపాల్‌శెట్టి, మూలగిరపల్లి ఓబన్న మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం ఎంపీడీఓకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

పారదర్శకత పాటించాలి

కుందుర్పి: ఖరీఫ్‌లో రైతులు వర్షాధారం కింద మెట్ట భూములు, బోరుబావుల కింద సాగుచేసిన పంటలను ఈ–క్రాప్ నమోదు చేయడంలో పూర్తి పారదర్శకత పాటించాలని ఏఓ మహేష్ సూచించారు. శుక్రవారం కుందుర్పిలో సిబ్బందికి ఈ–క్రాప్ నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బీకేల సిబ్బంది, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సదాస్మరామి విజయవంతం చేయండి

కుందుర్పి: మండల కేంద్రంలో ఎస్కే చారిటబుల్ ట్రస్టు పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించే సదాస్మరామి (మొక్కల పెంపకం) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 10 వేల మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టామని ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు లక్ష్మణమూర్తి, దిలీప్, అశ్వర్థనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం బాధ్యత వహించాలి'

కళ్యాణదుర్గం రూరల్: మణిపూర్‌లో గిరిజన మహిళపై పాశవికంగా ప్రవర్తించిన ఘటనకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని సీపీఐ, దళిత, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను ఖండిస్తూ శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు.

రీసర్వే పక్కాగా చేపట్టండి

కూడేరు: జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం ద్వారా చేపడుతున్న రీ సర్వే పక్కా చేపట్టాలని ఏడీ రూప్లా నాయక్ సూచించారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వేపై తహసీల్దార్ శేషారెడ్డి, సర్వేయర్లతో సమీక్షించారు. ఈ నెల 25 నాటికి ఎంఎంహళ్లిలో రీసర్వే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు.

రాయదుర్గం రూరల్: రెండో విడత భూ సర్వేలో భాగంగా శుక్రవారం వడ్రహొన్నూరు, బీఎన్ హళ్లి, జుంజురాంపల్లి గ్రామాల్లో ఆయా సర్పంచ్‌లు అశోక్, చంద్రకళ, ఎర్రిస్వామి రెడ్డి, వన్నూరుస్వామి అధ్యక్షతన గ్రామ సభలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి ,ఎంపీటీసీలు అరుణ్ కుమార్, మఠం సురేష్ , సచివాలయాల మండల కన్వీనర్ మురహరి, మాజీ ఎంపీపీ కుమార్ స్వామి, నాయకులు శివారెడ్డి, మలకాపురం నాగరాజు, గోపాల్ , జలంధర్ నాయుడు, రాయంపల్లి రామాంజనేయులు పాల్గొన్నారు.

గొడవలకు దిగితే ఉపేక్షించం

వజ్రకరూరు: మొహర్రం సందర్భంగా ఎవరైనా గొడవలకు దిగితే ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించమని ఎస్ఐ కె.రాజశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొహర్రం ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నేడు సివిల్ సప్లయీస్ కమిషనర్ పర్యటన

రాయదుర్గం రూరల్: సివిల్ సప్లయీస్ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ శనివారం రాయదుర్గంలో పర్యటిస్తున్నట్లు తహసీల్దార్ మారుతి శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆయన మండలంలోని ఆవులదట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేస్తారన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు 74 ఉడేగోళంలోని గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్‌సెంటర్ తనిఖీ చేస్తారన్నారు. అనంతరం పట్టణంలోని సామాజిక ఏరియా ప్రభుత్వాస్పత్రి నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షిస్తారన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వజ్రకరూరు: గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. పార్టీ జిల్లా కార్యదర్శి చలగుండ్ల అమరేష్, నియోజకవర్గ కన్వీనర్ నిరంజన్‌గుప్త, మండల అధ్యక్షుడు వడ్డె అంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

24న మురడిలో వేలం

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని మురడిలో ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏడాదిపాటు టెంకాయలు విక్రయించడం, కొబ్బరి చిప్పలు పోగుచేసుకోవడం, తలనీలాలు, పార్కింగ్ వసూళ్ల కోసం ఈ నెల 24న ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

నేర వార్తలు

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: శెట్టూరు మండలం లక్ష్మంపల్లి నుంచి కళ్యాణదుర్గానికి వస్తున్న ఆటో అదుపు తప్పి కళ్యాణదుర్గం మండలం గరుడాపురం వద్ద బోల్తాపడింది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. లక్ష్మంపల్లికి చెందిన చాంద్, బాబా ఆటోలో వ్యక్తిగత పని నిమిత్తం కళ్యాణదుర్గానికి వస్తున్నారు. మద్యం మత్తులో ఆటోను వేగంగా నడపడంతో గరుడాపురం వద్దకు రాగానే బోల్తా పడింది. గాయపడిన వారిని స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం: పట్టణ సమీపంలోని ముదిగల్లు రోడ్డు పక్కన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి వున్న సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వాహనాల తనిఖీల్లో భాగంగా మారుతి వే బ్రిడ్జి వద్దకు వెళ్లిన పట్టణ సీఐ తేజమూర్తి, ఎస్ఐ నాగమధుకు స్థానికులు విషయాన్ని తెలిపారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి వెళ్లి పురుగులు మందు సేవించి అపస్మారక స్థితిలో పడి వున్న వ్యక్తిని వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ వ్యక్తి శెట్టూరు మండలం మాలేపల్లికి చెందిన కురుబ వన్నూరుస్వామిగా పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని సీఐ తెలిపారు.

భూ వివాదంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో భూ వివాదంలో శుక్రవారం అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగింది. ఘటనలో శ్రీనివాసులు ముఖానికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన బాలుడి మృతి

రాయదుర్గం రూరల్: పట్టణంలోని ఎంసీపీ 4 లేఅవుట్ వద్ద ఈ నెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు తిప్పేరుద్ర(13) కర్నూలులో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ మురళి తెలిపిన వివరాల మేరకు.. పట్టణ సమీపంలోని కణేకల్లు రోడ్డులో తిప్పేస్వామి మూడు ఎకరాల వ్యవసాయ తోటను కౌలుకు చేస్తున్నాడు. తండ్రికి తెలియకుండా ద్విచక్రవాహనాన్ని వేసుకుని వెళ్లిన కుమారుడు కణేకల్లు రోడ్డు లో అదుపుతప్పి కిందపడ్డాడు. ఆ సమయంలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అనంతపురం సవేరా ఆస్పత్రికి తరలించగా.. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శుక్రవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

శెట్టూరు: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సర్వసభ్య సమావేశం సాగింది. శుక్రవారం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అన్ని గ్రామాల్లోని పనులు, సమస్యలు సభ్యులు చర్చకు తెచ్చారు. ములకలేడు, బచ్చేహళ్లి, అయ్యగార్లపల్లిలో పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలన్నారు. సచివాలయాల నిర్మాణం, రోడ్లు భవనాల పనులకు సంబంధించి ఎంబుక్స్ రాయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఇంజినీర్ కాంచనను నిలదీశారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ 36 పాఠశాలల్లో మనబడి నాడు నేడు పనులు జరుగుతున్నాయన్నారు. తహసీల్దార్ ఫణికుమార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1,907 సమస్యలను జగనన్న సురక్ష ద్వారా పరిష్కరించామన్నారు. భైరవానితిప్పప్రాజెక్టు కోసం మండలంలో భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లించామన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ తిమ్మరాజమ్మ, జెడ్పీటీసీ మంజునాథ, ఎంపీడీఓ మైథిలీ, ఏఓ సంధ్యాకుమారి, సూపర్‌వైజర్ రాధమ్మ, , మండల మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, సర్పంచ్‌లు తీన్మార్ తిమ్మరాజు, సత్యనారాయణ రెడ్డి, విరుపాక్షి, విరుపాక్షి గౌడ్, ఈరన్న, గొర్ల గంగాధర, వెంకటేశులు, నాగరాజు, పాలయ్య, గంగన్న, కోఆప్షన్ సభ్యులు మన్సూర్, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రం గ్రామంలో శనివారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.